పీ4ను పట్టించుకోరా?

పేదలను దత్తత తీసుకోవడానికి ముందుకురాని ప్రజాప్రతినిధులు


పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలం దించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు తీసుకొచ్చిన పీ4 కార్యక్రమంపై జిల్లా ప్రజాప్రతినిధుల్లో స్పందన కరువైంది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో 250 కుటుంబాలను దత్తత తీసుకుని చంద్రబాబు ఆదర్శంగా నిలిచినా ఆ స్ఫూర్తిని అందుకుని జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పేదలను దత్తత తీసుకునేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం.

చిత్తూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):2047 నాటికి రాష్ట్రంలో పేదరికం ఉండకూడదని సీఎం చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని తీసుకొచ్చారు.ఇందులో భాగంగా పేద కుటుంబాలను సర్వే చేసి గుర్తించారు. పేదలు ఆత్మన్యూనతకు గురికాకూడదనే ఆలోచనతో వారికి బంగారు కుటుంబాలు అనే పేరు పెట్టారు.శ్రీమంతులతో పాటు పారిశ్రామికవేత్తలు ఆయా కుటుంబాలను దత్తత తీసుకుని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనేది లక్ష్యం. ఇలా దత్తత తీసుకునేవారికి మార్గదర్శులని పేరుపెట్టారు. జిల్లావ్యాప్తంగా జరిగిన సర్వేలో 65,451 బంగారు కుటుంబాలను గుర్తించగా, వీటిలో 33,023 కుటుంబాలను 2813మంది దత్తత తీసుకున్నారు.చంద్రబాబును మినహాయిస్తే వీరిలో ఒక్క ప్రజాప్రతినిధి కూడా లేకపోవడం గమనార్హం.బంగారు కుటుంబాలను గుర్తించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో సర్వే పూర్తి చేసినా.. ఆశించిన స్థాయిలో మార్గదర్శులు ముందుకు రాలేదు.దీంతో జిల్లా అధికారులు దత్తత విభాగాన్ని ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్‌గా విభజించారు.ఫైనాన్షియల్ అంటే ఆయా బంగారు కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు అన్నిరకాల సాయాలు చేయాల్సి ఉంటుంది. నాన్ ఫైనాన్షియల్ అంటే ఆర్థిక సాయం కాకుండా వారికి స్కిల్స్ నేర్పించడం. అంటే, వారికి వ్యవసాయ, రుణాల మంజూరు వంటి అంశాల్లో ఉన్న సందేహాల్ని నివృత్తి చేస్తారు. ఆర్థిక అంశాలతో ముడిపడని అంశాలను మాత్రమే పరిష్కరించే ప్రయత్నం చేస్తారు.

● మార్గదర్శులంతా ఉద్యోగులే

నాన్ ఫైనాన్షియల్ విభాగంలో దత్తత తీసుకునే వీలుండడంతో జిల్లాలోని ఉద్యోగులు మార్గదర్శులుగా మారారు. టీచర్లు, సచివాలయ ఉద్యోగులు స్కిల్స్ నేర్పేందుకు కొన్ని కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారు. ఇలా 2813మంది ఉద్యోగులు 33,023కుటుంబాలను దత్తత తీసుకున్నారు.





● సీఎస్ఆర్ కోసం కలెక్టర్ ప్రయత్నాలు

బంగారు కుటుంబాల్ని ఆర్థికంగా ఆదుకునే మార్గదర్శుల్ని గుర్తించేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ తీవ్రంగా కృషి చేస్తున్నారు.ఇందులో భాగంగా జిల్లాకు చెందిన కంపెనీలతో పాటు బయటి ప్రాంతాల్లో ఉన్న కంపెనీలను కూడా సంప్రదిస్తున్నారు.కంపెనీల సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాల్ని దత్తత తీసుకోవాలని కోరుతున్నారు.

● చంద్రబాబు స్ఫూర్తిని అందుకోరా?

మార్గదర్శులకు ఆదర్శంగా ఉండేందుకు సీఎం చంద్రబాబు ముందుకొచ్చారు. తన నియోజకవర్గం కుప్పంలోని 250 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు గత నెలలోనే ప్రకటించారు. తన కుటుంబ సభ్యులూ మార్గదర్శులుగా ఇందులో భాగస్వాములవుతారని తెలిపారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు జూలై 25న అమరావతిలో ఐయామ్ మార్గదర్శి లోగోను ఆవిష్కరించారు.ఆయన పిలుపుతో ఎన్ఆర్ఐలు సైతం స్పందించి మార్గదర్శులుగా మారేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. అయితే జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటివరకు సీఎం చంద్రబాబు మూడుసార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో వీడియోకాన్ఫరెన్సులు నిర్వహించారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధుల నుంచి స్పందన రాకపోవడం విశేషం.

రైతాంగానికి రూ.వందకోట్ల రుణాలిస్తాం

డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న అమాస రాజశేఖర్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 75 సింగిల్ విండోల ద్వారా స్వల్ప, దీర్ఘ, వ్యవసాయేతర రుణాలుగా రూ.వంద కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని డీసీసీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలోని మీటింగు హాల్లో సింగిల్ విండోల సీఈవోలతో సమీక్షించారు. సింగిల్ విండోల త్రిసభ్య కమిటీ చైర్మన్ల విజ్ఞప్తితో ఈ మేరకు రుణాలివ్వాలని నిర్ణయించామని చెప్పారు. ప్రస్తుతం 10 సింగిల్‌విండోల ద్వారా అన్నిరకాల రుణాల రూపేణ రూ.79 లక్షలు అందించడం జరిగిందని వివరించారు. రైతుల ఇబ్బందులను గుర్తిస్తూ ప్రతి సింగిల్ విండో రూ.2కోట్ల మేరకు వివిధరకాల రుణాలు ఇవ్వడానికి ఆదేశాలు జారీచేశారు. కంప్యూటరీకరణ నిర్ణీత వ్యవధికంటే ముందుగానే పూర్తిచేయడంపై సీఈవోలను అభినందించారు. ఈనెలాఖరులోగా అన్ని సింగిల్‌విండోల్లోనూ ఈ-ఆడిట్ పూర్తిచేయాలని సూచించారు. సీఈవో శంకర్ బాబు మాట్లాడుతూ.. కొత్తరుణాలు ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకు జనరల్ మేనేజర్ మనోహర్ గౌడ్, డీజీఎం వెంకటాచలపతి, లీగల్ అడ్వైజర్ గంగిరెడ్డి, ఏజీఎం సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం గురుకుల విద్యాలయంలో.. మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

రామకుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని డా.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఎస్సీ కేటగిరిలో మిగులు సీట్లకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ రజనీకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కేటగిరికి సంబంధించి ఐదో తరగతిలో 43, 6వ తరగతిలో 8, ఏడో తరగతిలో 2, తొమ్మిదో తరగతిలో 1, పదో తరగతిలో 6, జూనియర్ ఇంటర్‌లో 29, సీనియర్ ఇంటర్‌లో 12 సీట్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అడ్మిషన్లు కావాలనుకున్న వారు సోమవారం నుంచి విద్యాలయంలోని కార్యాలయానికి రావాలన్నారు. పూర్తి వివరాలకు 7093495686 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.





వరలక్ష్మీ వ్రతానికి హాజరైన భక్తులు

వేణుగోపాలుడి ఆలయంలో శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం

వెదురుకుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయంలో వరలక్ష్మీవ్రతం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతతో స్వామి, అమ్మవార్లను మేల్కొల్పి మూలవర్లకు అభిషేకం చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయ ఊంజల్ మండపంలో వరలక్ష్మీవ్రతం చేపట్టారు. అనంతరం వ్రతం మహత్యాన్ని ఆలయ అర్చకులు తెలియజేశారు. ఆలయ ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, టీటీడీ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

గనుల లెక్కలు తేలుస్తున్నారు

అక్రమాలపై ఫిర్యాదుల వెల్లువ ● అనధికార గనుల నిర్వహణపైనా?

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూర్చడంలో గనులు, భూగర్భ శాఖ ప్రముఖమైంది. ఈ శాఖ ద్వారా మన జిల్లానుంచే ఏటా సుమారు రూ.160 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుంది. ఇక్కడి గ్రానైట్‌కు పక్క రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ మంచి గిరాకీ వుండడంతో ఎక్కువమంది ఈ వ్యాపారంపై మక్కువ చూపుతున్నారు.గత వైసీపీ ప్రభుత్వం సీనరేజ్ (ఆదాయం) వసూలు బాధ్యతను రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు అప్పగించి చేతులు దులుపుకుంది. ప్రభుత్వం మారడం, ఏజెన్సీ గడువు ముగియడంతో ఆ బాధ్యతలను గనుల శాఖాధికారులే చూస్తున్నారు. ఈ క్రమంలో ఎక్కువ మంది క్వారీ వ్యాపారం చేయడంపై మొగ్గు చూపుతుండడంతో క్షేత్రస్థాయిలో వివాదాలు, ఫిర్యాదులు అధికమవుతున్నాయి.కోర్టు కేసులుపెరుగుతున్నాయి.ఈ క్రమంలో గనుల శాఖపై యంత్రాంగం దృష్టి సారించింది. అనధికారిక క్వారీల నిర్వహణపైనా తనిఖీలు జరుపుతున్నారు.కడప రీజియన్ అధికారులు క్వారీల్లో తనిఖీలు చేస్తుండగా త్వరలో కేంద్ర బృందం రంగంలోకి దిగనుంది.కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మైన్స్ అధికారులు గత నెల 31వ తేదీ నుంచి క్వారీల్లో తనిఖీలు చేపట్టారు. గనుల శాఖ నుంచి టెక్నికల్ అసిస్టెంట్, రెవెన్యూ శాఖ నుంచి సర్వేయర్లు, పోలీసుశాఖ సిబ్బంది తనిఖీల్లో పాల్గొంటున్నారు.



గుడిపాల మండలంలోని ఓ క్వారీలో తనిఖీలు

క్వారీల్లో అక్రమాలు గుర్తించాం



రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో కలిసి గత నెల 31 నుంచి గనుల్లో తనిఖీలు చేపట్టాం.అనుమతులు, వినియోగం, హద్దులు.... ఇలా అన్ని కోణాల్లోనూ సర్వే చేస్తున్నాం. ఇప్పటివరకు పలు గనుల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించాం. ఇందుకు సంబంధించి నివేదికలు సిద్ధం చేస్తున్నాం. పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం.

- ఎస్ఏవీ సత్యనారాయణ, మైన్స్ డీడీ

లెక్కల ప్రకారం 433 క్వారీలు

భూగర్భ గనుల శాఖ లెక్కల ప్రకారం చిత్తూరు జిల్లాలో 433 క్వారీలున్నాయి. వీటిలో బ్లాక్ గ్రానైట్ 160 కాగా, కలర్ గ్రానైట్ 153, కంకర (గ్రావెల్స్) 9, సున్నపురాళ్లు (క్వార్ట్జ్) 2, రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ 92, రోడ్‌మెటల్, బిల్డింగ్ స్టోన్, కంకర 17 యూనిట్లు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో 236 క్వారీలు పనిచేస్తుండగా, నిలిచిపోయిన క్వారీల్లో ఏడాది కాలంలో 58 రెన్యువల్ చేశారు. మరో 32 క్వారీలకు డెడ్ రెంట్ కట్టారు.2014 నుంచి క్వారీల కోసం ఏకంగా 2,485 దరఖాస్తులు రాగా ప్రాధాన్య క్రమంలో కేటాయిస్తూ వస్తున్నారు. వీటిలో 14 క్వారీలు మంజూరవగా, మరో 18 సర్వే దశలో ఉన్నాయి. జిల్లా గనుల శాఖ కార్యాలయంలో ఇటీవలే రికార్డులను తనిఖీ చేశారు.క్వారీల్లో ఎన్ని నడుస్తున్నాయి, ఎన్ని రెన్యువల్ చేశారు, నిబంధనలు అనుసరించి అనుమతులు ఇచ్చారా, గనులు సక్రమంగా నడుస్తున్నాయా, ఎక్కడైనా అక్రమణలు జరిగాయా.. అనే అంశాలపై రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలనా చేపట్టారు.

చెలిమిచేను జలపాత సోయగాలు



రామకుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కౌండిన్య అభయారణ్యంలో జలపాతాలు హోరెత్తుతున్నాయి. ననియాల తాండా, రామాపురంతాండా, వీర్నమల, బల్ల అటవీప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో చెలిమిచేను, బడాలగట్టు జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. చెలిమిచేను జలపాతం పైభాగంలో బండరాళ్లను చీల్చుకుంటూ జలాలు ఉధృతంగా కిందకు జాలువారుతున్నాయి. అక్కడి నుంచి చుట్టూ పచ్చనికొండల మీదుగా సుమారు 150 అడుగుల కిందకు హోరు శబ్దం మధ్య జలాలు దూకుతున్నాయి.చెలిమిచేను, బడాగట్టు జలపాతాలకు వెళ్లేందుకు ఉన్న దారులను రహదారులుగా మార్చి, జలపాతాల వద్ద రక్షణ ఏర్పాట్లు చేస్తే ఈ ప్రాంతం పర్యాటకులకు అనువుగా ఉంటుంది. జలపాతాల నుంచి జాలు వారే జలాలు తమిళనాడుకు వృథాగా పోతున్నాయి. జలపాతాల దిగువ భాగాల్లో భారీ చెక్‌డ్యాంలు నిర్మించి జలాలను నిలువరిస్తే అటవీ ప్రాంతంతోపాటు ఆరేడు పంచాయతీల్లో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి.

బండరాళ్లపై నుంచి జాలువారుతున్న జలాలు



జలపాతాలతో చెలిమిచేను జలపాతం



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న భక్తులు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గూడూరు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం గూడూరు ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పోలీ సుల వివరాల మేరకు... స్థానిక మాయాబజారుకు ప్రాంతానికి చెందిన హనుమంతు, గమళ్లపాళెం ప్రాంతానికి చెందిన గణేష్ 600 గ్రాముల గంజాయి చిన్న ప్యాకెట్లతో రైల్వేస్టేషన్ తూర్పు వైపున ఉన్న పాడుపడిన క్వార్టర్స్ వద్ద వద్ద ఉండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నిషేధిత మత్తు పదార్థాలను స్థానిక ఆస్పత్రి రోడ్డులోని రెండు దుకాణాల మధ్య సన్నని సందులో దాచిపెట్టి, అదే ప్రాంతానికి చెందిన నయాం అనే వ్యక్తి సాయంతో విక్రయాలు సాగిస్తున్నట్లు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతయ్య తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు
గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,234
తలనీలాలు సమర్పించినవారు: 26,133

సుస్థిర ప్రగతి దిశగా శ్రీసిటీ

- ఎండీ రవీంద్ర సన్నారెడ్డి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులు

సత్యవేడు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పదిహేడేళ్ల ప్రస్థానంలో ప్రపంచ తయారీ గమ్యస్థానంగా శ్రీసిటీ మారడం ఎంతో సంతోషంగా ఉందని ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. శ్రీసిటీ ఏర్పడి 17 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇక్కడి బిజినెస్ సెంటర్‌లో తిరుపతి ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ... పరిశ్రమలు, ఉపాధితో పాటు సామాజిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహక పారిశ్రామిక విధానాలు, సహకారంతో భవిష్యత్తులో శ్రీసిటీ సుస్థిర ప్రగతి దిశగా మరింత వేగంగా ముందుకు సాగనుందని తెలిపారు. శ్రీసిటీలోని పలు పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.

తిరుపతి, రేణిగుంటల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- బేకరీలు, స్వీట్ షాపుల్లో శ్యాంపుల్స్ సేకరణ
- ఒక బేకరీ సీజ్.. మరోదానికి నోటీసులు



తిరుపతిలోని బేకరీలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు శుక్రవారం వివిధ బేకరీలు, స్వీట్ షాపులపై తనిఖీలు చేశారు. వీరితో పాటు తూనికలు, కొలతల శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పాడైన స్వీట్లు, తినుబండారాలను ధ్వంసం చేశారు. రేణిగుంలోని ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు ఉల్లంఘించి పరిశుభ్రత పాటించని ఎప్పీ ఫుడ్ బేకరీని సీజ్ చేశారు. టూటీ ఫ్రూటీ తయారు చేసే దుకాణంలో పరిశుభ్రత, వినియోగదారులకు సౌకర్యాలు లేకపోవడంతో యజమానికి నోటీసులు జారీ చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో 17 బృందాలుగా ఏర్పడి 35 బేకరీలు, స్వీట్ షాపులపై అధికారులు తనిఖీలు జరిపారు. 31 ఆహార పదార్థాలను శ్యాంపుల్స్‌గా సేకరించి ల్యాబ్‌కు పంపారు. దాదాపు 75 కిలోల కాలం చెల్లిన స్వీట్లు, తినుబండారాలను సీజ్ చేసి ధ్వంసం చేసినట్లు రాష్ట్ర ఫుడ్ కంట్రోల్ జాయింట్ కమిషనరు పూర్ణచంద్రరావు చెప్పారు. ఈ తనిఖీల్లో జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి, సిబ్బంది జగదీష్, సుమన్, దాదాపు 25 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో హైకోర్టు న్యాయమూర్తులు




జస్టిస్ ప్రవీణ్ కుమార్ - జస్టిస్ మాల

తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ ప్రవీణ్ కుమార్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ మాల శుక్రవారం ఉదయం శ్రీవారిని వేర్వేరుగా దర్శించుకున్నారు.ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.వీరికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాల ప్రకారమే..

ఇకపై సరుకుల కొనుగోలు

- టీటీడీ నిర్ణయం -

తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): ఇకపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) నియమావళి ప్రకారమే టీటీడీ మార్కెట్ విభాగం 52 ఆహార వస్తువులు కొనుగోలు చేయనుంది. టెండర్లలో ఎలాంటి మినహాయింపులూ లేకుండా కొనుగోళ్లు జరగాలని టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన సిఫార్సులను అమలు చేయనుంది. గత ప్రభుత్వంలో టీటీడీ అన్నప్రసాదాలు, లడ్డూప్రసాదాల నాణ్యత, రుచి తగ్గాయంటూ తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం మారిన తర్వాత వీటి రుచిని పెంచేందుకు టీటీడీ ఫోకస్ పెట్టింది. ఈవో శ్యామలరావు బృందం తొలుత కల్తీ నెయ్యిని గుర్తించి సరఫరా చేసే కొన్ని సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. గతంలో నిలిపివేసిన నందిని నెయ్యి కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అలాగే ప్రసాదాలు, అన్నప్రసాదాలు, లడ్డూ వంటి వాటిలో వినియోగించే ఆహార వస్తువుల కొనుగోలు ప్రక్రియ గత ప్రభుత్వంలో గతి తప్పినట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలు ఉన్నప్పటికీ టీటీడీ ప్రొక్యూర్మెంట్ విధానంలోని స్టాండర్డ్స్ సక్రమంగా లేనట్టు తేలింది. ఈ క్రమంలోనే కొనుగోళ్లలో పాదర్శకత, నాణ్యత పెంపు కోసం రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ నిపుణుల సేవలను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకోవాలని గతేడాది నవంబరులో నిర్ణయించారు.

టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ద్వారా..

నిపుణుల సూచనలను పరిశీలించేందుకు టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్టీ డైరెక్టర్ ఆనంద రామకృష్ణన్, ప్రభుత్వ జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు, మైసూరు సీఎఫ్‌టీఆర్ఐ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఉషారాణిని నియమించారు. ఈ కమిటీ 52 ఆహార వస్తువుల స్పెసిఫికేషన్లను ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు అనుగుణంగా సవరించి నివేదిక సమర్పించింది. దీని ఆధారంగానే ఇకపై టెండర్ల ద్వారా కొనుగోలు చేయాలని సూచించింది. నెయ్యి కొనుగోలులోనూ సెన్సరీ పారామీటర్లు చేర్చాలని, ఎన్ఏబీఎల్ అక్రిడిటెడ్ ల్యాబ్ సర్టిఫికెట్ తప్పనిసరి అనే సూచనలు చేసింది. దీని ప్రకారమే ఇకపై ఆహార వస్తువులను కొనుగోలు చేయాలని టీటీడీ అధికారులు గత నెలలో నిర్ణయించారు.

శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం

- కన్నుల పండువగా స్వర్ణ రథోత్సవం

తిరుచానూరులో వ్రత వేడుకలు






టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరికి కంకణధారణ చేస్తున్న వేదపండితులు



తిరుచానూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థానమండపంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపుచేసి పద్మపీఠంపై కొలువు దీర్చి పూజాక్రతువులు నిర్వహించారు. అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపెంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూల, వృక్షి వంటి సంప్రదాయ పుష్పాలతో అర్చించారు. తొమ్మిది గ్రంధులతో(నూలుపోగులు) అలంకరించారు. వరలక్ష్మి పూజావిధానం, వ్రత మహాత్మ్యాన్ని అర్చకుడు శ్రీనివాసాచార్యులు భక్తులకు వివరించారు. 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించాక మహామంగళ హారతితో వరలక్ష్మి వ్రతం ముగిసింది. వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఏపీ, తెలంగాణలోని 52 టీటీడీ ఆలయాల్లో సౌభాగ్యం పేరిట 8లక్షల గాజులు, 1.60 లక్షల కంకణాలు, 1.60 లక్షల పసుపుదారాలు, 1.60 లక్షల కుంకుమ ప్యాకెట్లు, లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను అందించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో హరీంధర్ నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, వీజీవోలు సురేంద్ర, రాంకుమార్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాదు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్రత మండపం

టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటుచేసిన వ్రత మండపం భక్తులను ఆకట్టుకుంది. 40మంది సిబ్బంది, 3 టన్నుల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల 30వేల కట్ ఫ్లవర్స్‌తో అలంకరించారు.



స్వర్ణరథంపై అమ్మవారి అభయం

పద్మావతి ఉత్సవమూర్తిని శ్రీమహాలక్ష్మి అలంకారంలో స్వర్ణరథంపై కొలువుదీర్చారు. సాయంత్రం 6గంటలకు భక్తుల గోవిందనామ స్మరణల నడుమ తిరుమాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథం లాగడానికి మహిళా భక్తులు పోటీ పడ్డారు. వ్రతం సందర్భంగా అమ్మవారి మూలవర్లను బంగారు చీరతో అలంకరించారు. వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభమైంది. గేటు నెంబరు 4గుండా భక్తులను అనుమతించారు. క్యూలైన్లలో రద్దీ.. ఎండ వేడిమికి భక్తులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సర్వదర్శనం గంటన్నరకుపైగా పట్టింది.



వాహనసేవ ముందు కళా బృందాల ప్రదర్శన

రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే సహించం

- ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే తీవ్ర ఉద్యమానికి శ్రీకారం
- ప్రజా సంఘాల ఐక్య వేదిక సమావేశంలో నేతల స్పష్టీకరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తే ప్రశాంతమైన తిరుపతిలో ప్రజలెవ్వరూ సహించరని ప్రజా సంఘాల ఐక్య వేదిక అఖిల పక్ష సమావేశంలో నేతలు స్పష్టం చేశారు. తిరుపతిలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్, ఆర్పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత యువకుడు నీలం పవన్ కుమార్ కిడ్నాప్, దాడి దుర్మార్గమైనదని అన్నారు. ఆర్థిక లావాదేవీలుంటే పోలీసులు, కోర్టులు ఉన్నాయన్నారు. రాజకీయ అండ చూసుకుని చిత్రహింసలు పెట్టడం ఆవేదనకు గురి చేసిందన్నారు. తిరుపతి వంటి ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రంలో రౌడీలు, గుండాలకు చోటివ్వకూడదన్నారు. ఇంతటి తీవ్ర దుర్మార్గానికి పాల్పడిన వారిని తిరుపతి నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన బయటికి వచ్చింది, రానివి ఇంకెన్ని జరిగాయో తేల్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. నిందితులను అరెస్టు చేస్తే పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేయడం ఏమిటని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్మార్గాలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండు చేశారు. పోలీసులు డ్రోన్లను నేర చరిత్ర గల రాజకీయ నేతల చుట్టూ తిప్పాలన్నారు. తిరుపతి ప్రశాంతతను కాపాడేందుకు రౌడీలు, నేరస్తులు భయపడే పరిస్థితి తీసుకురావాలని పోలీసులను సీపీఐ (ఎంఎల్) నేత వెంకటరత్నం కోరారు. 'ఈ దాడికి పాల్పడిన వారి నేర చరిత్రను పూర్తిగా పరిశీలించాలి. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మనుషులే ఈ దాడికి పాల్పడ్డారనే ఆరోపణ వస్తోంది. దీనిపై భూమన స్పందించకపోవడం మరింత బలం చేకూరుస్తోంది' అని కాంగ్రెస్ నేత దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతిలో రౌడీలు, గుండాలకు తావులేకుండా చేయడానికి, ఇలాంటి దారుణాలను కట్టడి చేయడానికి ప్రభుత్వానికి, పోలీసులకు ప్రజల అండ అవసరమని మాజీ మంత్రి పరసారత్నం అన్నారు. తమిళనాడు తరహాలో దళితులు ఒక కమిటీగా ఏర్పడి ప్రతిఘటనకు సిద్ధపడకుంటే మరిన్ని దారుణ పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని సత్యవేడు మాజీ ఎమ్మెల్యే సురాజ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఎంఆర్పీఎస్ నాయకుడు మధు, కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) నేత శ్రీనివాసులు, లాయర్స్ అసోసియేషన్ నేత చల్లా వెంకటయ్య, కాంగ్రెస్ నగర కార్యదర్శి యార్ల గోపి, టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడికొండ ప్రసాదరావు, అంబేడ్కర్ ఆర్మీ నేత గోపి, సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, టీడీపీ నేత ఆముదాల తులసీరాం, ఏఎస్ పరమేశ్వరరావు, దళిత మహాసభ నేత ప్రభాకర్, మైనారిటీ సంఘ నాయకులు అమీర్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్పీఐ) జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, వీసీకే నేత రమేష్, పలు ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

తీర్మానాలు

- పవన్‌కూ, బాధిత కుటుంబానికి అండగా నిలవాలి. తిరుపతిలో రాష్ట్ర సదస్సు చేపట్టి, అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులను తీసుకురావాలి.
- నిరుపేద దళిత యువకుడి కుటుంబాన్ని జగన్మోహన్ రెడ్డి ఓదార్చాలి.
- తిరుపతిలో రౌడీయిజాన్ని రూపుమాపడానికి అందరూ ముందుకు రావాలి.

మొక్కు తీర్చుకున్న పట్టాభి

- కాలినడకన తిరుమలకు

తిరుపతి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మొక్కు తీర్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాలినడక తిరుమలకు వస్తానని మొక్కుకున్నారు. ఆ మేరకు శుక్రవారం కుటుంబ సమేతంగా అలిపిరి పాదాల మండపం నుంచి తిరుమలకు వెళ్లారు. జగనాసుర కబంధ హస్తాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి కలిగించి, కూటమి అధికారంలోకి రావాలని శ్రీవారిని వేడుకున్నానని ఈ సందర్భంగా పట్టాభి చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా కాలినడకన తిరుమలకు వెళుతున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా అలిపిరిలోని శ్రీవారి పాదాల మండపం వద్ద టీడీపీ నాయకులు వారికి స్వాగతం పలికారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు,కరాటే చంద్ర. ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్ పాటకం వెంకటేష్, జిమ్ ప్రకాష్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



అలిపిరి పాదాల మండపం వద్ద స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

తిరుమల ఘాట్‌రోడ్డులో జింక పిల్ల మృతి



తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో శుక్రవారం ఓ జింక పిల్ల మృతి చెందింది. మార్గంలోని చివరి మలుపు వద్ద ఎలాంటి కదలికలు లేకుండా పడిఉన్న ఆరు నెలల వయసున్న జింకను చూసిన కొంతమంది వాహనదారులు విజిలెన్స్, అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీ అధికారులు జింకను పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో వాహనం ఢీకొనలేదని, కొండ పైభాగం నుంచి కిందపడి మృతి చెంది ఉండవచ్చని తెలియజేశారు.



కె.శ్రీనివాస్‌కు కేఎస్ జయమ్మ స్ఫూర్తి పురస్కార ప్రదానం

అమ్మను మించిన సామాజిక సంస్కర్త ఎవరూ లేరు

సామాజిక సాహిత్య విశ్లేషకులు కె.శ్రీనివాస్

పలమనేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):అమ్మను మించిన సామాజిక సంస్కర్త ఎవరూ లేరని ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు,సామాజిక సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.పలమనేరులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన సాహితీ సభలో ఆయనకు కేఎస్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని రచయిత పలమనేరు బాలాజి అందజేశారు.ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జయమ్మ కుమారుడిగా పలమనేరు బాలాజి ఏకలవ్య కాలనీ ఎరుకల కథల్లో తన తల్లి ఔన్నత్యాన్ని అక్షరీకరించి,ఆమెను చిరంజీవిగా నిలిపారన్నారు.తల్లిదండ్రులు మరణించినా వారి పేరున చేసే ఇటువంటి కార్యక్రమాలు వారిని సజీవంగా వుండేట్లు చేస్తాయన్నారు.ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్, రచయిత ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆధిపత్య భావజాలాన్ని,దోపిడీ విధానాల్నిసామాజిక అసమానతల్ని తన రచనల ద్వారా శ్రీనివాస్ ఎండగట్టారని ప్రశంసించారు.రచయితలు జి.వెంకట కృష్ణ, సుంకోజి దేవేంద్రాచారి,రాఘవ శర్మ, సహదేవనాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం,నెమిలేటి కిట్టన్న , బాబ్జీ, కొత్తపల్లి సురేష్, టీఎస్ఏ కృష్ణమూర్తి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, పల్లిపట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం..!

● నేలకూలిన చెట్లు, విద్యుత్తు స్తంభాలు



గాలివానతో నేలవాలిన విద్యుత్ స్తంభం

కల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ తీగలపై కొమ్మలు విరిగిపడటంతో ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో కల్లూరు తదితర ప్రాంతాల్లో రాత్రంతా అంధకారం నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్తు శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టి శుక్రవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. భారీ వర్షంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరడంతో వర్షపు నీటితో కళకళలాడుతున్నాయి.



సోమలలో భారీ వర్షం

టమోటా పంటకు నష్టం

సోమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గురువారం సోమలలో 37. 4 మి.మీ కురవగా మళ్లీ శుక్రవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం జరిగింది. పెద్దఉప్పరపల్లెలో రహదారి గుంతలమయమై వాహనదారులకు ఇబ్బందిగా మారింది. టమోటా తోటల్లో వర్షపు నీరు నిలిచి తోటలు దెబ్బతిన్నాయి. టమోటాలకు గిట్టుబాటు ధరలు పలుతున్న వేళ వర్షం దెబ్బతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లోని చెరువులకు జలకళ నెలకొంది. పలు చోట్ల వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది.



చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్లకండ్రిగ వద్ద తెగిపడిన 220 కేవీ లైన్

వర్షాలతో విద్యుత్ శాఖకు నష్టం

చిత్తూరు రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చిత్తూరు డివిజన్ పరిధిలో విద్యుత్ శాఖకు సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది.చిత్తూరు రూరల్ మండలం రెడ్డిగుంట, బంగారుపాళ్యం, పూతలపట్టు మండలాల పరిధిలో, పైపల్లి ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్ని చోట్ల విద్యుత్ తీగలు తెగిపడడంతో సంస్థకు రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని ఈఈ మునిచంద్ర తెలిపారు. అలాగే చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్లకండ్రిగ వద్ద 220 కేవీ విద్యుత్ లైన్ తెగిపడడంతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు అప్రమత్తమై మరమ్మత్తులు పూర్తిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.



అరగొండలోని గాజులపల్లె వద్ద నేలరాలిన ట్రాన్స్‌ఫార్మర్

29మండలాల్లో వానలు

గుడిపాలలోనే 115 మిమీ వర్షపాతం నమోదు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వేసవితాపంతో అవస్థలు పడుతూవచ్చిన ప్రజలకు నాలుగైదు రోజులుగా ఉపశమనం కలుగుతోంది. జూలై 15 నుంచి 30వ తేదీ మధ్య వేడి, ఉక్కపోత వాతావరణం నెలకొని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల 3వ తేది నుంచి ఎండ తీవ్రత తగ్గి వర్షాలు ప్రారంభమయ్యాయి. నైరుతి రుతుపవనాల ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితులు జిల్లాకు అనుకూలంగా మారాయి. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్న కారణంగా జిల్లాలోని 29 మండలాల్లో వర్షాలు దంచేశాయి. అత్యధికంగా గుడిపాలలో 115 మి.మీ వర్షం నమోదు కాగా, అత్యల్పంగా గుడుపల్లెలో 2.6 మిమీ వర్షం కురిసింది. మండలాలవారీగా పులిచెర్లలో 77.8, కార్వేటినగరంలో 65.4, పలమనేరులో 59.6, చిత్తూరు అర్బన్‌లో 57, ఐరాలలో 54, శ్రీరంగరాజపురంలో 51.2, యాదమరిలో 47.4, గంగవరంలో 42.2, తవణంపల్లెలో 41.4, చిత్తూరు రూరల్‌లో 41.2, గంగాధరనెల్లూరులో 40.6, వి.కోటలో 40.2, నింద్రలో 38.2, రొంపిచెర్లలో 32.8, వెదురుకుప్పంలో 32.2, చౌడేపల్లె, బంగారుపాళ్యం మండలాల్లో 30, రామకుప్పంలో 28.6, పెద్దపంజాణిలో 27.4, సోమలలో 26.8, సదుంలో 24.2, పాలసముద్రంలో 21.4, పూతలపట్టులో 20.4, పుంగనూరులో 18.6, నగరిలో 16.2, పెనుమూరులో 15.4, బైరెడ్డిపల్లెలో 12.4, శాంతిపురంలో 12.2, విజయపురంలో 8.4, కుప్పంలో 3.2 మిమీ వర్షం కురిసింది. రాబోయే రెండు వారాల్లో ఎక్కువ రోజులు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ప్రస్తుత వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం



వరదరాజస్వామి ఆలయంలో శ్రావణ లక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళా భక్తులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రధాన ఆలయంలో మూల విరాట్‌కు పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ విగ్రహాన్ని ప్రధాన ఆలయం నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పీఠంపై ఉంచి మహిళా భక్తులతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహింపజేసి, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమానికి వరదరాజస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఉభయదారుగా వ్యవహరించారు. సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఈవో పెంచలకిషోర్, సూపరింటెండెంట్ వాసు, భక్తులు పాల్గొన్నారు.

ఆరు ఆలయాల పాలకవర్గాలకు నోటిఫికేషన్

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆరు ఆలయాల నూతన పాలక వర్గాల నియామకానికై శుక్రవారం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరేట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో చిత్తూరు కోదండ రామాలయం, కుప్పంలోని తిరుపతి గంగమ్మ గుడి, నగరి దేశమ్మ ఆలయం, పలమనేరు కాశీ విశ్వేశ్వర ఆలయం, పుంగనూరు వరదరాజ స్వామి ఆలయం, మొగిలిలోని మొగిలీశ్వరాలయం ఉన్నాయని జిల్లా ధార్మిక పరిషత్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ముగిసిన వేణుగోపాలుడి తెప్పోత్సవాలు




తెప్పపై రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి

వెదురుకుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. తర్వాత మూల విరాట్‌ను సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం తొమ్మిది గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం స్కంద పుష్కరిణిలోని తెప్పపై అధిష్ఠింపజేసి 9 చుట్లు విహరింపజేశారు. భక్తుల గోవిందనామ స్మరణలు, వేదమంత్రాల నడుమ తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, వేద పండితులు శబరీష్, రమేష్, గోపాలాచారి, షరాబు బాబు సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'విజయం' నాక్ అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని మిట్టూరులో ఉన్న విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలకు నాక్ అక్రిడిటేషన్ గడువు పొడిగించినట్లు విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నుంచి స్వయం ప్రతిపత్తి (అటానమస్) సాధించడం ద్వారా బెంగళూరులోని నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) చెల్లుబాటు గడువు 2030 డిసెంబరు 31వ తేదీవరకు అధికారికంగా పొడిగింపుపై హర్షం వ్యక్తం చేశారు. తేజోమూర్తి మాట్లాడుతూ.. అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరచుకోవడానికి ఈ పొడిగింపు ఉపయోగపడనుందని చెప్పారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాలు



అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతి కరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మూడో శ్రావణ మాస శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తుల అన్నదానం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిత్తూరులో పవన్

● లాడ్జీలో బంధించిన నిందితులు

● విడిపించి తిరుపతికి తీసుకొచ్చిన పోలీసులు

● వైసీపీ గ్యాంగ్ దాడి ఘటనపై విభిన్న కోణాల్లో విచారణ





పవన్ - అనిల్‌ను రుయాస్పత్రిలో వైద్య పరీక్షలకు తీసుకెళుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో భూమన అభినయ్ అనుచరుల చేతిలో తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్ ఆచూకీ శుక్రవారం లభ్యమైంది. చిత్తూరులోని ఓ లాడ్జీలో బంధించినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని విడిపించి తిరుపతికి తీసుకొచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. రెంటల్ బైక్ తీసుకుని అద్దె చెల్లించలేదంటూ వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నేతలు దినేష్, జగదీశ్వరరెడ్డి, అజయ్‌కుమార్ తదితరులు బుధవారం మధ్యాహ్నం దాడి చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడం.. పోలీసులు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ దాడిలో బాధితుడు పులిచెర్ల మండలం మొరవపల్లికి చెందిన పవన్‌కుమార్ బుధవారం రాత్రి తప్పించుకుని వెళ్లారు. దినేష్‌తో పాటు పవన్‌కూ కల్లూరు మండలం ఇస్రాకులపల్లికి చెందిన జానకిరాం స్నేహితుడు. వీరి నుంచి తప్పించుకెళ్లిన పవన్ చిత్తూరు బస్సు ఎక్కగా.. జానకిరాం కూడా అదే బస్సులో కలిసి చిత్తూరుకు బయలుదేరారు. అదే సమయంలో పోలీసు రంగంలోకి దిగడం, తమపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదవడంతో నిందితుల్లో ఒకడైన దినేష్ స్పందించాడు. పవన్‌కుమార్‌ను దాచి ఉంచాలని జానకిరామ్‌కు చెప్పాడు. చిత్తూరులో వీరిని రాజు (చిత్తూరుకు చెందిన ఇతడు తిరుపతిలో ప్లాట్ల వ్యాపారం చేస్తూ, వైసీపీ గ్యాంగ్‌తో చేతులు కలిపి ఫైనాన్సు చేస్తున్నాడు) కలిశాడు. కట్టమంచి సమీపం, ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే దారిలోని ఓ లాడ్జిలో గది తీసుకుని పవన్‌ను అందులో బంధించారు. అతడితో పాటు జానకిరాంను ఉంచారు. కేసు నుంచి తప్పించుకునేలా, దళిత సంఘాల ఆందోళనలు తీవ్రం కాకుండా ఉండేలా దినేష్ కథ నడిపాడు. అందులో భాగంగా 'నన్ను ఎవరూ ఏమీ చేయలేదు. మా అన్న దినేష్ చిత్రహింసలు పెట్టి కొట్టాడంటూ దళితులు ఆందోళన చేసి నన్ను ఇబ్బంది పెట్టాల్సిన పనిలేదు' అంటూ జానకిరాం, రాజు కలిసి పవన్ చేత చెప్పించి ఆ వీడియో రిలీజ్ చేశారు.

ఆందోళన.. సుఖాంతం

రెండు రోజులుగా పవన్ కనిపించకుండా పోవడం.. సెల్‌ఫోను ఆఫ్.. ఆన్ చేస్తుండటం పోలీసులను, తల్లి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసింది. ఇతడి ఆచూకీ కోసం ఎస్పీ హర్షవర్ధన రాజు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, ఇద్దరు సీఐలు ముమ్మరంగా గాలించారు. జానకిరామ్ ఫోను నెంబరు ట్రేస్ చేసి చిత్తూరులో ఉన్నట్లు శుక్రవారం గుర్తించారు. అలా లాడ్జీలో ఉన్న పవన్, జానకిరాంను పట్టుకుని తిరుపతి పోలీసులకు అప్పగించారు. ఈ వీడియో తనను చంపేస్తామని బెదిరించి మాట్లాడించారని ఈ సందర్భంగా పోలీసులకు పవన్ వాగ్మూలం ఇచ్చినట్లు తెలిసింది. ఈ కేసును వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి అరెస్టు : ఈ కేసులోని నలుగురు నిందితుల్లో అనిల్‌కుమార్‌రెడ్డి, దినేష్, జగదీశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండుకు పంపారు. అజయ్‌కుమార్ పరారీలో ఉన్నాడు. రిమాండ్‌లోని ముగ్గురు నిందితులను మళ్లీ కస్టడీకి తీసుకుని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ ముగ్గురితో పాటు రాజు, జానకిరాం, మరో ఐదుగురి పేర్లు చార్జిషీటులో చేర్చనున్నట్లు తెలిసింది. వీరందరిపై రౌడీషీట్లు ఓపెన్ చేయడానికి పోలీసులు సన్నద్ధమవుతున్నారు.



జస్టిస్ గోపాలకృష్ణకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో కిషోర్

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని శుక్రవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాలకృష్ణ, జస్టిస్ తుహిన్‌కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో పెంచలకిషోర్ స్వామి దర్శన ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేన మాజీ ఇన్‌చార్జి వినుతకు

షరతులతో బెయిల్

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : డ్రైవరు కమ్ పీఏ హత్య కేసులో శ్రీకాళహస్తి జనసేన మాజీ ఇన్‌చార్జి కోట వినుతకు బెయిల్ మంజూరైంది.గత నెల 7వ తేదీన డ్రైవరు రాయుడు అలియాస్ శ్రీనివాస్‌ను చంపి మృతదేహాన్ని గోనెసంచిలో మూటకట్టి చెన్నై సమీపంలోని కువ్వా నది కాలువలో పడవేసినట్లు వినుత, ఆమె భర్త చంద్రబాబు సహా మరో ముగ్గురిపై చెన్నై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ కేసులో వినుతకు చెన్నై కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.రోజూ ఉదయం 10గంటల్లోపు చెన్నైలోని సెవెన్‌హిల్స్ పోలీసు స్టేషన్‌లో సంతకం చేయాలని కోర్టు షరతు విధించింది.

ఆవును కాపాడబోయి విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం



జానకిరామ్ (ఫైల్ ఫొటో)

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆవును కాపాడబోయి ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో దుర్మరణం చెందాడు. కాణిపాకం ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండలం కాకర్లవారిపల్లెకు చెందిన జానకిరామ్(53) తన వ్యవసాయ బావి వద్ద శుక్రవారం సాయంత్రం ఆవును మేపుతున్నాడు. దగ్గర్లో ఓ విద్యుత్ తీగ పడి ఉండటాన్ని గమనించారు. ఆవుకు విద్యుత్ తీగ తగులుతుందని దాన్ని తీయడానికి ప్రయత్నించాడు. తీగను పట్టుకున్న చోటే తెగి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వీడని పీటముడి

ఐవీఆర్ఎస్‌లో తేలనున్న టీడీపీ మండల అధ్యక్ష పదవుల పంచాయితీ

అయినా వెదురుకుప్పం పెండింగే

పీఏసీఎస్ ఛైర్మన్ నియామకంలో కూడా...

వెదురుకుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష పదవుల పంచాయితీ చిక్కుముడి ఇంకా వీడలేదు.చిత్తూరులో మంగళవారం జరిగిన సమావేశంలో రెండు మండలాలకు సంబంధించి ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మండలానికి రెండు పేర్లు ఎంపిక చేసి పార్టీ అధిష్ఠానానికి పంపించారు. వెదురుకుప్పం నుంచి మూడు పేర్లు పంపినట్లుసమాచారం.పెనుమూరునుంచి రుద్రయ్య నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, కార్వేటినగరం నుంచి చెంగల్రాయ యాదవ్, రవి యాదవ్, గంగాధరనెల్లూరు నుంచి స్వామిదాస్, దేవదాసు, పాలసముద్రం నుంచి శివకుమార్‌నాయుడు, వాసు నాయుడు, ఎస్ఆర్‌పురం నుంచి జయ శంకర్ నాయుడు, వేమా నాయుడు పేర్లు వెళ్లాయి. వెదురుకుప్పం నుంచి కిషన్‌చంద్, మోహన్‌మురళి, లోకనాథరెడ్డి పేర్లు వెళ్లినట్లు సమాచారం.మండల అధ్యక్షుల నియామకానికి సంబంధించి ఐవీఆర్ఎస్ నుంచి ఫోన్ కాల్స్ వచ్చినట్లు గ్రామ కమిటీ అధ్యక్షులు కొంతమంది తెలిపారు.వెదురుకుప్పం మండలానికి మాత్రం ఐవీఆర్ఎస్ కాల్స్ రాకపోవడంతో జాప్యం చోటుచేసుకుందన్న ప్రచారంజరుగుతోంది. పీఏసీఎస్ ఛైర్మన్ పదవుల నియామకం కూడా రెండు మండలాల్లో బ్రేక్ పడింది.పెనుమూరు, పాలసముద్రం మండలాల్లో పీఏసీఎస్ ఛైర్మన్ పదవుల కోసం పోటీ పెరగడం వల్ల త్రిసభ్యకమిటీ నియామకంలో జాప్యంచోటుచేసుకుంది. మిగిలిన వెదురుకుప్పం, కార్వేటినగరం, జీడీనెల్లూరు, ఎస్ఆర్‌పురం మండలాలకు పీఏసీఎస్ ఛైర్మన్లు, డైరెక్టర్లనియామకం జరిగినవిషయంతెలిసిందే.

కాలువలో పడి బాలుడి మృతి

పుంగనూరు రూరల్,ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): పైపులైన్ కోసం తీసిన కాలువలో పడి రెండేళ్ల బాలుడు శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. చౌడేపల్లె మండలం కాగతి పంచాయతీ పగడాలవారిపల్లె వద్ద ఓ కోళ్లఫామ్‌లో కొంతకాలంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన మహేశ్ దంపతులు కూలీలుగా పనిచేస్తున్నారు. ఇటీవల పైపులైన్ కోసం ఎక్సకవేటర్‌తో కాలువ తీయగా వర్షానికి ఆ కాలువ నీటితో నిండింది. మహేశ్ కుమారుడు మంజు(2) ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటికాలువలో పడ్డాడు. గమనించి బయటకు తీసేలోపు అపస్మారకస్థితిలోకి వెళ్లాడు.బాలున్ని చికిత్స నిమిత్తం కుటుంబీకులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.అయితే బిడ్డ మృతి చెందాడని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.





మంజు మృతదేహం - మంజు మృతి చెందిన కాలువ

డిగ్రీ కళాశాలల అధ్యాపకుల బదిలీలు నిర్వహించాలి



ఎమ్మెల్సీ కంచర్లకు వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ అధ్యాపకులు

కుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాఘవరెడ్డి కోరారు. కుప్పంలో శుక్రవారం ఈ సంఘం ఆధ్వర్యంలో పలువురు అధ్యాపకులు రాఘవరెడ్డితో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. రాష్ట్రం ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల్లో ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తమకు బదిలీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల రీ డిసిగ్నేషన్ ఆమోదించి అమలు చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న జీవో నెంబర్ 42ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఎమ్మెల్సీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, సభ్యులు నందీశ్వరయ్య, శ్రీనివాసులు, బాలాజీ, వెంకటేశ్, మాధవి, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



కందూరు-సోమల మార్గంలో మలుపు

సోమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ప్రధాన రహదారుల్లో పలు చోట్ల మలుపులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించే లోపే ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమల-కలికిరి మార్గంలోని చిన్న సోమల పాఠశాల, బోయకొండ ఆలయం వద్ద మలుపులు, నెల్లిమంద పాలేటమ్మ ఆలయం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే సోమల-చౌడేపల్లె మార్గంలోని చెన్నపట్నం చెరువు నడింపల్లె క్రాస్ రోడ్డు, మేటిమంద క్రాస్ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. తిరుపతి - పుంగనూరు మార్గంలోని అభయాంజనేయస్వామి ఆలయం మలుపు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడగాని రోడ్డు మలుపులు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రోడ్డు రవాణాశాఖ అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. వీటికి తోడుగా రోడ్డుకు ఇరువైపులా గత ఐదేళ్లుగా మొక్కలు పెరిగిపోయాయి. రోడ్డు పనులు చేయకపోవడంతో ముల్లపొదలు రోడ్డుపైకి వ్యాపిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతికి నివాళి



లంకిపల్లి మహేశ్‌బాబును పరామర్శిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ చెన్నుపాటివారిపల్లికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు లంకిపల్లి చంద్రశేఖర్‌నాయుడు గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి శుక్రవారం చెన్నుపాటివారిపల్లికి చేరుకొని ఆయన మృతదేహానికి ఘన నివాళి అర్పించారు. మృతుడి కుమారుడు లంకిపల్లి మహేశ్‌బాబును, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు రామనాథంనాయుడు, ధనంజయనాయుడు, కుమార్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు, మునికృష్ణమనాయుడు, లోకేష్, నరేంద్రచౌదరి, ధన, నజీర్, రమేష్, నాగరాజనాయుడు, కరుణాకర్‌నాయుడు, అనిల్‌కుమార్, సుబ్రహ్మణ్యం నాయుడు, ప్రభాకర్‌నాయుడు, సురేష్, రాజేష్, చెంగల్రాయనాయుడు నివాళులర్పించారు.

అసంపూర్తిగా సహకార సంఘ గోదాము



సోమలలో అసంపూర్తిగా ఉన్న సింగిల్ విండో గోదాము

సోమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కేంద్రం సింగిల్ విండో గోడౌన్ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం రూ.49 లక్షలు మంజూరు చేసింది. గత మూడేళ్లుగా నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. సకాలంలో పను లు పూర్తి కాక పోవడంతో ప్రజల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా ఆగిన గోడౌన్ మందుబాబులకు నిలయంగా మారిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సోమల - కందూరు మార్గంలోనే రోడ్డు పక్కనే ఉండటంతో గోడౌన్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. అధికారులు స్పందించి అసంపూర్తి పనులు పూర్తి చేసి రైతులకు అనువుగా మార్చాలని రైతులు కోరుతున్నారు.

బీసీ నాగరాజ్‌కు గౌరవ డాక్టరేట్



యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి డాక్టరేట్ అందుకుంటున్న బీసీ.నాగరాజ్

కుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సం స్థల అధినేత బీసీ. నాగరాజ్‌కు ప్యారిస్‌లోని థేమ్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కుప్పం నియో జకవర్గంలో విద్యా రంగ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి ఈ డాక్టరేట్ లభించింది. బీసీఎన్ సంస్థల్లో విద్యార్థులు ఉన్నత నైపుణ్యం సాధించడానికి ఆయన అందిస్తున్న సేవల ఆధారంగా డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ తనకు లభించిన డాక్టరేట్‌తో సమాజంపైన, విద్యారంగంపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

సచివాలయ ఉద్యోగిపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగి మోసం చేశారని ఓ రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైతు కథనం మేరకు... మండలంలోని మేలుందొడ్డి పంచాయతీ గోపిశెట్టిపల్లెకు చెందిన దాసరప్ప కుమారుడు సంజీవ్ రామకుప్పం మండలంలోని సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొండమదొడ్డికి చెందిన రైతు వెంకటరమణకు ప్రభుత్వ సబ్సిడీతో ట్రాక్టర్ ఇప్పిస్తానని నమ్మించి రూ. 4.60 లక్షలు డబ్బులు తీసుకున్నాడు. కొన్ని నెలలు గడిచినా ట్రాక్టర్ ఇప్పించకపోవడంతో రైతు వెంకటరమణకు అనుమానం వచ్చి డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఇవ్వకుండా తననే బెదిరిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16వ వార్డు ఎన్నికలకు సన్నాహం

- 20న ఓటర్ల జాబితా ప్రచురణకు ఎన్నికల కమిషన్ ఆదేశం

కుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న కుప్పం పురపాలక సంఘం 16వ వార్డు ఎన్నికలకు సన్నాహాలు మొదలయ్యాయి. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఖాళీగా ఉన్న 34 వార్డులకు ఈనెల 29వ తేదీన ఫొటో ఓటర్ల జాబితా ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 6వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. చిత్తూరు జిల్లాలో కుప్పం పురపాలక సంఘంలోని 16వ వార్డు ఖాళీగా ఉంది. ఈ వార్డు నుంచి వైసీపీ తరఫున కౌన్సిలర్‌గా గెలిచి, మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అధిష్ఠించిన డాక్టర్ సుధీర్, టీడీపీలో చేరిపోయారు. దీనికి ముందే ఆయన మున్సిపల్ చైర్మన్ పదవితోపాటు కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేశారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ తో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 16వ వార్డుకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది బిజీగా ఉన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 16వ వార్డు ఓటర్ల జాబితా సవరించే పనులు జరుగుతున్నట్టు చెప్పారు. ఈనెల 20న ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు,

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీ టి.ఎస్ అగ్రహారానికి మూడురోజులపాటు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వి.జీవన్‌కుమార్ తెలిపారు. టి.ఎస్ అగ్రహారం వద్ద విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్నందున ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఏడీఈ కోరారు. ఈనెల 9న రెండో శనివారం కావడంతో పలమనేరు అర్బన్, పలమనేరు రూరల్, గంగవరం, బైరెడ్డిపల్లి మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వి.జీవన్‌కుమార్ తెలిపారు.

బోయకొండ పాలక మండలికి దరఖాస్తు చేసుకోండి

చౌడేపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్తల పాలక మండలి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉపకమిషనర్ ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ కమిషనర్ వినయ్‌చంద్ ఆదేశాలతో ట్రస్ట్ బోర్డు సభ్యుల కొరకు ఈనెల ఈనెల 27 లోపు ఆసక్తి కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరెన్ని వివరాలకు బోయకొండ గంగమ్మ ఆలయ అధికారులను సంప్రదించాలని కోరారు.

రేపు రామకుప్పంలో కంటి వైద్యశిబిరం

రామకుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రామకుప్పంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్టు వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో నిపుణులైన కంటి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారన్నారు. అర్హులైన వారికి పీఈఎస్ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సదుం ట్రాన్స్‌కోలో సిబ్బంది కొరత

సదుం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ట్రాన్స్‌కో విభాగంగా సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో 18 పంచాయతీలు ఉండగా అవసరమైన 18 మంది లైన్‌మెన్‌లకు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీంతో ఏ పంచాయతీలోనైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, మరమ్మతులు సకాలంలో చేపట్టాలన్నా ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి. స్థానిక ఏఈ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమేనని, త్వరలో సమస్యకు పరిష్కార చర్యలు ఉన్నతాధికారులు తీసుకుంటారని తెలిపారు.

హడలెత్తిస్తున్న శునకాలు

సోమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో పలు గ్రామాల్లో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. సోమల పట్టణంలో విచ్చల విడిగా తిరుగుతూ చికెన్ సెంటర్ల వద్ద శునకాలు పడిగాపులు గాస్తూ దారిన పోతున్న వాహనదారులను, పిల్లలను గాయపరుస్తున్నాయి. సోమలకు చెందిన సోమశేఖర్ లేగదూడలు పొలం వద్ద ఉండగా శునకాలు దాడి చేసి రక్తగాయాలు చేశాయి. గొల్లపల్లిలోని గంగాధరం మేకలు, గొర్రెల మందలో తరచూ వీధి కుక్కలు దాడులు చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల సంతతి పెరగకుండా కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కృష్ణాష్టమి వేడుకల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఐ లోకేశ్‌రెడ్డి

పలమనేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 16న కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం పలమనేరు పోలీసు స్టేషన్ లో ఎస్.ఐ లోకేశ్‌రెడ్డి చే ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక పలమనేరు కమిటీ అధ్యక్షులు రెడ్డి భాస్కర్, జ్యోతి, సరళ, రోజా తదితరులు శుక్రవారం ఎస్.ఐని కలిసి వేడుకలకు ఆహ్వానించారు.

మండీపేట రహదారి గుంతలమయం..!



పలమనేరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలోని మండీపేట కోటూరు రోడ్డు దుస్థితికి చేరుకొని ఏడాది కావవస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మండీపేట నుంచి సముద్రపల్లి మీదుగా పలమనేరుకు వచ్చే రహదారికి బీటీ రోడ్డు వేసేందుకు గత ప్రభుత్వ హయాంలో కంకర వేసి కాంట్రాక్టరు అలాగే వదిలేశారు. అప్పటి నుంచి గత రెండేళ్లుగా ఈరోడ్డుపై వేసిన కంకర లేచిపోయి గుంతలు పడి పాదచారులు ద్విచక్రవాహనదారులు, ఆటోలు వెళ్లేందుకు వీలుకాని విధంగా రోడ్డు దుస్థితికి చేరుకొంది. ఈమార్గంలో దాదాపు 15 గ్రామాలకు రాకపోకలు చేస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విస్తారంగా వర్షాలు..!

- పుంగనూరులో వడగండ్ల వర్షం
- రామకుప్పంలో వర్షంతో జలకళ
- నిండుతున్న చెరువులు



89పెద్దూరులో నిండుకుండలా బాపనచెరువు



ఎస్.గొల్లపల్లె చెరువులో చేరిన జలాలు

రామకుప్పం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడి చినా కుప్పం నియోజకవర్గంలో వాన చినుకు జాడ లేక రైతులతోపాటు సామాన్య జనం ఆందోళనకు గురయ్యారు. గత పదిహేను రోజులుగా ఇక్కడ వేసవిని తలపించేలా కాసిన ఎండలు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అయితే గత మూడు, నాలుగు రోజులుగా ఈ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. గురు, శుక్రవారాల్లో రామకుప్పం మండలంలో కురిసిన భారీ వర్షాలతో రైతుల్లో, జనాల్లో సంతోషం నెలకొంది. ముఖ్యంగా మండల పరిధిలోని అటవీ సమీప ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షంలో జలవనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ముద్దనపల్లె, గొరివిమాకులపల్లె, పంద్యాలమడుగు, పీఎంకేతాండా, 89పెద్దూరు, వీర్నమల, పెద్దతాండా, గురుకులమడుగు, చిక్కపల్లి, బల్ల, ఉన్సిగానిపల్లె, విజలాపురం, కెంచనబల్ల, మణీంద్రం పంచాయతీల పరిధిలో కురిసిన వానలతో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల్లోకి పెద్ద ఎత్తున వర్షపునీరు చేరాయి. 89పెద్దూరులోని బాపనచెరువు, గౌనిచెరువులు పూర్తిగా నిండి మొరవలు పారుతున్నాయి. బల్ల పంచాయతీ పాలరేవులో జలప్రవాహం ప్రారంభమైంది. కెంచనబల్ల పంచాయతీ గంగమ్మచెరువు వంక చెక్‌డ్యాం నిండి, మొరవ ప్రవహిస్తోంది ఆదేవిధంగా అటవీ ప్రాంతంలోని పలు చెక్‌డ్యాంలు నిండి పొంగి ప్రవహిస్తున్నాయి.

- **పుంగనూరు:** పుంగనూరులో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం పడింది. వర్షం కురవడంతో పుంగనూరులో పలు చోట్ల గోతులు పడిన రోడ్లపై నీరుచేరి చిన్న చెరువులను తలపించాయి. స్థానిక ఎన్ఎస్‌పేట, వనమలదిన్నె రోడ్డు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద వర్షం నీరు రోడ్డుపై పారడంతో కొంత సేపు రాకపోకలకు అంతరాయం కలిగింది.
- **వి.కోట:** వి.కోట మండల పరిధిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. గత మూడు రోజులుగా క్రమం వరుసగా వానలు కురుస్తుండటంతో వాతావరణం చల్లబడింది. శుక్రవారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురవడంతో పట్టణం అంతా వాననీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని భారత్‌నగర్ ప్రాంతంలో వాననీటితో రెండు వీధుల్లో నీరు నిల్వ ఉండటంతో జనం రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.



సోమల: పెద్దఉప్పరపల్లె సమీపంలో పారుతున్న గార్గేయనది



పుంగనూరులో కురుస్తున్న వడగండ్ల వర్షం

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



పీఈఎస్‌లో తల్లిపాల వారోత్సవాలలో పాల్గొన్న వైద్య ప్రముఖులు, విద్యార్థులు

కుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పట్టించిన శిశువులు సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని పలువురు వైద్య నిపుణులు పేర్కొన్నారు. కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రి చిన్నపిల్లల విభాగంలో వారం రోజులుగా జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంటు డాక్టర్ ఎన్‌కే.సుబ్రహ్మణ్యం, ముఖ్య అతిథిగా పాల్గొన్న కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయకుమారి మాట్లాడుతూ శిశువు పుట్టిన ఆరునెలల వరకు తల్లిపాలే పట్టాలన్నారు. ఇది ఆరోగ్యానికి చాలా శ్రేష్ఠమని చెప్పారు. ప్రసూతి విభాగం వైద్యుడు డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలన్నారు. కేవలం శిశువుకే కాకుండా తల్లిపాలు బిడ్డలకు పట్టడంతో తల్లి రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధుల బారి నుంచి దూరమవుతుందని పేర్కొన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చిత్రా నాగరాజు మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యత గురించి వివరించారు. నర్సింగ్ విద్యార్థులు నృత్య రూపకంతో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ హరిచంద్ర, చిన్నపిల్లల వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

కొమ్మ విరిగిపడి యువకుడికి గాయాలు



పాతూరునత్తం వద్ద రహదారిలో విరిగిపడిన భారీ చెట్టుకొమ్మ

బైరెడ్డిపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె నుంచి కడపనత్తం వెళ్లే రహదారిలో పాతూరునత్తం సమీపంలో శుక్రవారం ఓ నేరేడుచెట్టు కొమ్మ విరిగిపడి పాతపేట గ్రామానికి చెందిన చందు అనే యువకుడు గాయపడ్డాడు. బైరెడ్డిపల్లె నుంచి చందు బైక్‌లో పాతపేటకు వెళుతుండగా పాతూరునత్తం వద్ద అకస్మాత్తుగా నేరేడుచెట్టు కొమ్మ విరిగి రహదారిపై పడింది. కొమ్మ తగలడంతో త్రుటిలో తప్పించుకుని స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

రామకుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో వరమహాలక్ష్మీ వ్రతాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్ష చేపట్టి అమ్మవారి మూర్తులకు ఇంటింటా విశేష అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, వరమహాలక్ష్మీ వ్రతం ఇతివృత్తం, విశిష్టతను చదివి కుటుంబసభ్యులకు వినిపించారు. చివరగా హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వైష్ణవిదేవికి పూజలు



చౌడేపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శ్రావణ మాస శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



- చౌడేపల్లె: వరలక్ష్మీ వ్రతాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా స్థానిక బజారు వీధిలోని హరి మందిరంలో శాస్త్రోక్తంగా వ్రతాన్ని నిర్వహించుకున్నారు.

సదుం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ వరలక్ష్మీ వ్రత నోములను శుక్రవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నోచుకున్నారు. ఇళ్లల్లో లక్ష్మీ ప్రతిమలను కొలువుదీర్చి ప్రత్యేక పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మహిళలు స్థానిక నాగ దేవతలకు పూజలు చేసి నోములు నోచుకున్నారు. జీవిత కాలం సుమంగళిగా ఉండేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు.



- **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలో శుక్రవారం వరలక్ష్మీవ్రతం పండుగ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాట గంగమ్మ ఆలయంలో అర్చకులు నాగేం ద్ర అమ్మవారికి అభిషేకం చేసి విశేషాలం కరణతో పూజలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, సల్లాపురెమ్మ ఆలయం, శేషాద్రిస్వామి, కోదండరామాలయం, పట్నపల్లె కల్యాణవెంకన్న ఆలయం, మురారిపల్లె ఓబులేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి.
- **సోమల:** మండలంలోని పలు ఆవులపల్లె ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి పంచామృతాభిషేకం, అభిషేక పూజలు చేపట్టారు.



రొంపిచెర్లలో జరిగిన వరలక్ష్మీవ్రతంలో మహిళలు



విరూపాక్షి మారెమ్మ

- **పుంగనూరు:** పుంగనూరు పరిసర ప్రాంతాల్లోని ఆలయాలు, ఇళ్లల్లో ప్రజలు శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం జరుపుకున్నారు. స్థానిక కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో వరలక్ష్మీ అమ్మవారిని గజవాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. టీటీడీ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు. అలాగే పలు ఆలయాల్లో పూజలు చేపట్టారు.
- **కల్లూరు:** పులిచెర్ల మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు నిర్వహించారు. దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు.
- **రొంపిచెర్ల:** రొంపిచెర్ల శ్రీసాయిబాబా ఆలయంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు.
- **వి.కోట:** వరమహాలక్ష్మీ దేవి వ్రతాన్ని వి.కోట మండల పరిధిలో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నక్కబండలో బాలిక అదృశ్యం

పుంగనూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని నక్కబండ కాలనీకి చెందిన ఓ బాలిక (14) గత రెండు రోజుల నుంచి కనిపించలేదని తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ అశ్వర్థనారాయణ కేసు నమోదు చేశారు.

ఆకాశాన్నంటిన పూల ధరలు

సదుం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం వారపు సంతో పూల ధరలు ఆకాశాన్ని అంటాయి. అయినా వరలక్ష్మీ వ్రత పూజల కోసం మహిళలు పూలను ఎగబడి కొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, వీకే విశ్వనాథ్

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో నిర్వహించనున్న శరన్నవ రాత్రి ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే జగన్మోహన్ ఆవిష్కరించారు. ఆయనకు అర్చకులు జగదీశ్, ఈవో తిమ్మారెడ్డి స్వాగతం పలికారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ దిలీప్ రెడ్డి, మాజీ ఛైర్మన్ వీకే విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడిమాస ఉత్సవాలు



ఓంశక్తి ఆలయం వద్దకు ఊరేగింపుగా గంజి ప్రసాదం తీసుకొస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) అమ్మవారు

నగరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని ఓంశక్తి ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నగరి పట్టణం, పరిసర ప్రాంతాలకు చెందిన ఓంశక్తి మహిళా భక్తులు సుమారు 540 మంది సూర్య జూనియర్ కళాశాల నుంచి గంజి కలశాలతో ఓంశక్తి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. ఈ సందర్భంగా ఆదిపరాశక్తి వేషధారణలోని మహిళలు చేసిన నృత్యం అలరించింది. అమ్మవారిని సుమారు 1,300 దర్శించుకున్నారని ఆలయ నిర్వాహకుడు జ్యోతినాయుడు తెలిపారు. సహకరించిన పోలీసు, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి : టీడీపీ


నింద్రలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నింద్ర టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 'సుపరిపాలనలో టీడీపీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు భాస్కర్, సంపూర్ణమ్మ, శరవణ, పెరిమాల్ రెడ్డి, కోటేశ్వరరావు, రామకృష్ణమరాజు తదితరులు పాల్గొన్నారు.

కూనమరాజుపాళెంలో మహాలక్ష్మీ హోమం



మహాలక్ష్మీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్లో) అమ్మవారు

నింద్ర, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూనమరాజుపాళెంలోని మహాలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు అమ్మవారి కుంకుమ, కంకణాలు, పసుపు దారాలను ఆలయ ప్రధాన అర్చకుడు రూపేష్ కృష్ణ పంపిణీ చేశారు. ఉదయం గురునాథ్ ఆచారి కుటుంబీకుల ఉభయంతో అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం లోక కల్యాణార్థం మహాలక్ష్మీ హోమం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో గీతామందిర ఆశ్రమ పీఠాధిపతి పుండరీక వరదానంద స్వామి, పాపానాయుడుపేట నాగానంద స్వామి, ఈశ్వరాపురం శివానంద స్వామి పాల్గొన్నారు. ఆలయానికి ఎదురుగా లక్ష్మీనారాయణ అన్నదాన సత్రానికి శంకుస్థాపన చేశారు. సాయంత్రం టీటీడీ ఆధ్వర్యంలో హరికథ, అన్నమాచార్య సంకీర్తనలు గానం చేశారు.

పల్లూరులో బాలుడిపై కుక్కల దాడి

- తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలైన చిన్నారి


చిన్నారి తొడ, చేతిపై గాయాలు

గుడిపాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పానాటూరు పంచాయతీ పల్లూరు గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కూడా వీధిలో ఆడుకుంటున్న దర్శన్ (10)పై కుక్కలు దాడిచేసి తొడ, చేతిభాగంలో కరిచాయి. తీవ్రగాయాలవడంతో చిన్నారిని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం గుడిపాల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. గ్రామంలో సుమారు 40 వీధికుక్కలు ఉన్నాయని, నెలకు ఇద్దరు, ముగ్గురిని కరుస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేరుశనగ పంటలో నిలిచిన వర్షపు నీరు


దాసరాపల్లెలో..

యాదమరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేరుశనగ పంటల్లో వర్షపు నీరు నిలిచాయి. నీరు ఇలాగే ఉంటే వేళ్లు కుళ్లిపోయి, చీడ, పీడలు సంక్రమించి, దిగుబడులపై ప్రభావం చూపుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని 33, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులను శనివారం చేపట్టనున్నట్లు ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా శనివారం పూతలపట్టు నియోజకవర్గంలో పూతలపట్టు మండలం మినహా.. యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో, చిత్తూరు నియోజకవర్గంలోని చిత్తూరు టౌన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాలసముద్రం మండలంలోనూ..

పాలసముద్రం: మండలంలోని కావేరిరాజుపురం, బొమ్మరాజుపురం, వెంగళ్రాజుకుప్పం, నరసింహాపురం గ్రామాల్లో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లోకేష్ రెడ్డి తెలిపారు. నిర్వహణ పనుల కోసం సరఫరాను నిలిపేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండును ముంచెత్తిన వరదనీరు

తీవ్రంగా ఇబ్బందిపడ్డ ప్రయాణికులు




వరద నీటితో నిండిన బస్టాండు పరిసరాలు, సైకిల్ స్టాండ్

చిత్తూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ బస్టాండు పరిసరాలను వరద నీరు ముంచెత్తింది. దీనివల్ల ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బస్టాండు ఆనుకుని ఉన్న కట్టమంచి చెరువుకు వచ్చే ప్రధాన కాలువకు భారీగా వరద నీరు వచ్చింది. ఈ కాలువ నిండిపోయి బయటకు ప్రవహించడంతో బస్టాండు పరిసరాలు, సైకిల్ స్టాండ్ నీట మునిగాయి. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు బస్టాండ్‌ను పరిశీలించారు. మరోసారి బస్టాండులోకి వరదనీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు సూచించారు. నాయకులు గోపీనాథ్, మణి, రఘు తదితరులు పాల్గొన్నారు.

మము కరుణించు.. వరలక్ష్మీ..!


చవటగుంటలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మము కరుణించు.. వరలక్ష్మీ అంటూ మహిళలు వేడుకున్నారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వాడవాడలా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ● గిరింపేట దుర్గాంబ ఆలయంలో ఈవో తిమ్మారెడ్డి పర్యవేక్షణలో దుర్గాంబను మహాలక్ష్మిగా అలంకరించి, వ్రతాన్ని నిర్వహించారు. మహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వెంకటేశ్వరాలయం, సంతపేట విజయలక్ష్మి కాలనీ పెరుమాల్ ఆలయం, గుర్రప్పనాయుడు వీధిలోని అంకాల పరమేశ్వరి ఆలయం, మురకంబట్టు కరణం కాలనీలోని మహాలక్ష్మి ఆలయంలోనూ వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు.

గుడిపాల: మండలంలోని 197 రామాపురం, ముట్టుకూరుపల్లె, నంగమంగళం, చిత్తపార, చింతగుంటూరు, మరకాలకుప్పం, ఏఎల్‌పురం, తదితర గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు.

విజయపురం: మండలంలోని పన్నూరులో ఆనందవల్లి సమేత ఇష్టకామేశ్వరస్వామి ఆలయం, జగన్నాథపురంలోని శ్రీరామనామ క్షేత్రం, పాతార్కాడు, మహారాజపురంలో విఘ్నేశ్వరస్వామి ఆలయం, ఆలపాకంలోని మహాలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు బాలసుబ్రహ్మణ్య శర్మ, రాంప్రసాద్‌శర్మ, మందవాసి మహేష్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు వైభవంగా నిర్వహించారు.

వెదురుకుప్పం: మండలం చవటగుంట ద్రౌపది అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ● కార్వేటినగరంలోని ద్రౌపది అమ్మవారి ఆలయంలోనూ వరలక్ష్మీ వ్రతం జరిగింది. భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ ఆవరణంలో వేపచెట్టుకు చేసిన అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేళం రవి యాదవ్ పర్యవేక్షించారు.




చిత్తూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు - కార్వేటినగరంలో సారె తీసుకొస్తున్న భక్తులు, వేపచెట్టుకు అమ్మవారి అలంకరణ

ఆరిమాని గంగమ్మకు పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గంగమ్మగుడిలోని ఆరిమాని గంగమ్మకు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకుడు వెంకటాచలపతి, టీడీపీ నేత పైనేని మురళి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం పూర్తయ్యేదెప్పుడు?



పాలసముద్రం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మణిపురం గ్రామంలో అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా ఉంది. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద రూ.10లక్షలను ఈ భవన నిర్మాణం కోసం మంజూరు చేశారు. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ మాత్రం సకాలంలో బిల్లులు చెల్లించలేదని పనులను ఆపేశాడు. భవనం పూర్తికాక పోవడంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. దీనివల్ల చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ భవనాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలల అధ్యాపకుల బదిలీలు నిర్వహించాలి

- ఎమ్మెల్సీకి ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం వినతి

కుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి కోరారు. కుప్పంలో శుక్రవారం పలువురు అధ్యాపకులతో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల్లో ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు పూర్తి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తమకు బదిలీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల రీ డిసిగ్నేషన్ ఆమోదించి అమలు చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న జీవో నెంబర్ 42ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమస్యలను సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. సభ్యులు నందీశ్వరయ్య, శ్రీనివాసులు, బాలాజీ, వెంకటేశ్, మాధవి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల భవనాలు


స్లాబ్ పెచ్చులూడిన బొమ్మసముద్రం పశువైద్యశాల భవనం

గుడిపాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బొమ్మసముద్రం, గుడిపాలలో ఉన్న పశువైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బొమ్మసముద్రం భవనం స్లాబ్ అయితే పెచ్చులూడుతోంది. ఎప్పుడు కూలుతుందోనని పశువైద్యులు, ఇక్కడికొచ్చే రైతులు భయపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు చెబుతున్నారు. ఇపుడైనా ఈ భవనాలను బాగు చేయడమో లేదా కొత్తవి నిర్మించడమో చేయాలని కోరుతున్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి


నవీన్ (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న నవీన్ (30) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. తండ్రి మల్లయ్య ఇటీవల మరణించడంతో కారుణ్య నియామకం కింద ఇతడికి ఉద్యోగం వచ్చింది. నెల కిందట ఉద్యోగంలో చేరినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. మృతి చెందిన విషయం తెలియడంతో నవీన్ అంత్యక్రియలకు ప్రభుత్వం తరపున రూ.25వేలను కుటుంబీకులకు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ లోకేశ్ అందజేశారు. జూనియర్ అసిస్టెంట్ శంకర్, పంచాయతీ కార్యదర్శులు శివయ్య, కిరణ్‌కుమార్‌లతో కలిసి లోకేశ్ మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు


ఆపాకకండ్రిగ - జీఎంపురం తారు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

విజయపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరి - కనకమ్మ సత్రం నుంచి ఆపాకకండ్రిగ - జీఎంపురం వెళ్లే తారురోడ్డు బురదమయంగా మారింది. చిన్నపాటి వర్షానికే ఆలపాక కండ్రిగ బస్టాప్ వద్ద ఉన్న గుంతలో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. రాత్రి సమయాల్లో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రి ఫార్మా స్టోర్‌లో పాముల బెడద / వర్షమొస్తే ఉరుస్తున్న భవనం



చిత్తూరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని ఫార్మా స్టోర్‌లో పాముల బెడద ఎక్కువైంది. దీనివల్ల కొన్ని గదులను తెరవడమే మానేశామని సిబ్బంది చెబుతున్నారు. బ్రిటీష్ కాలం నాటి భవనం కావడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఉరుస్తోందని తెలిపారు. దీనివల్ల మందులు తడిచిపోతున్నాయన్నారు. ఇక సాయంత్రమైతే దోమల కారణంగా స్టోర్‌లో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన భవనం నిర్మించడమో లేదంటే స్టోర్‌ను మరో భవనానికి మార్చడమో చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

వైభవంగా గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆడిమాస పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి ఆలయ అర్చకులు పద్మనాభ గురుకుల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మూలవర్లను పూలరథంపై అధిష్ఠింపజేసి సీబీ రోడ్డు, దర్గా, ఎంఎస్‌ఆర్ జంక్షన్, రాజీవ్‌గాంధీ రోడ్డు, గిరింపేటలో గిరి ప్రదక్షిణను వైభవంగా నిర్వహించారు. వందలాది మంది నగరవాసులు పాల్గొన్నారు. గిరింపేట బ్రాహ్మణ వీధి సత్యసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో బాబాకు పల్లకీసేవ నిర్వహించారు.

జిల్లా కాంగ్రెస్‌లో నియామకాలు

వెదురుకుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శిగా వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లెకు చెందిన కందుకూరి హుమేష్‌ను ఆ పార్టీ నియమించింది. అలాగే జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా కార్వేటినగరానికి చెందిన దినకరప్రసాద్ నియమితులయ్యారు.

ప్రెస్‌క్లబ్‌కు టీవీ వితరణ

పూతలపట్టు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ప్రెస్‌క్లబ్‌కు తెలుగు యువత మాజీ అధ్యక్షుడు నరేష్ రెడ్డి శుక్రవారం ఎల్ఈడీ టీవీని వితరణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నగరి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని టీఆర్ కండ్రిగ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. విజయపురం మండలం గొల్లకండ్రిగకు చెందిన శామ్యూల్(21), హరీష్(18)లు నగరికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. వీరిని వేలావడి వైపుగా వెళుతున్న లారీ ఢీకొట్టడంతో గాయపడ్డారు. బాధితులను స్థానికులు నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు 'రాఖీ పౌర్ణమి'


రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని నగరవాసులు శనివారం జరుపుకోనున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం సాయంత్రం రాఖీలను అమ్మే దుకాణాలు, స్వీట్స్ షాపుల వద్ద యువతుల సందడి కనిపించింది.

కుప్పం 16వ వార్డు ఎన్నికలకు సన్నాహం

- 20న ఓటర్ల జాబితా ప్రచురణకు ఎన్నికల కమిషన్ ఆదేశం

కుప్పం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న కుప్పం పురపాలక సంఘం 16వ వార్డు ఎన్నికలకు సన్నాహాలు మొదలయ్యాయి. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఖాళీగా ఉన్న 34 వార్డులకు ఈనెల 29వ తేదీన ఫొటో ఓటర్ల జాబితా ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 6వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో కుప్పం పురపాలక సంఘంలోని 16వ వార్డు ఖాళీగా ఉంది. ఈ వార్డు నుంచి వైసీపీ తరఫున కౌన్సిలర్‌గా గెలిచి, మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని అధిష్ఠించిన డాక్టర్ సుధీర్ టీడీపీలో చేరిపోయారు. దీనికిముందే ఆయన మున్సిపల్ ఛైర్మన్ పదవితోపాటు కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేశారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌తో 16వ వార్డుకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 16వ వార్డు ఓటర్ల జాబితా సవరించే పనులు జరుగుతున్నట్టు చెప్పారు. ఈనెల 20న ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు.